క్లుప్తంగా

వీఆర్వోపై కలెక్టర్ కు ఫిర్యాదు

కంభం: కందులాపురం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కందులాపురం వీఆర్వో ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం ఒంగోలులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ తెలిపారు. కంభం- జంగంగుంట్ల మధ్యలో హైవే రోడ్డుపై ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా, ఇతర చోట్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా సదరు వీఆర్వో పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

రాచర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య సోమవారం తనిఖీ చేశారు. గిద్దలూరు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జె.రామకోటయ్య మొట్టమొదటి సారిగా రాచర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌తో పాటు పరిసరాలను, రికార్డులను తనిఖీ చేసి సూచనలు, సలహాలను ఇచ్చారు. ఆయన వెంట ఎస్సై ఇమ్మానియేల్, ఏఎస్సై ఆదిశేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజశ్రీ

కొమరోలు: సాంకేతిక పరిజ్ఞానం సమగ్ర పంటల యాజమాన్యం ద్వారా పంటలను పండించాలని వ్యవసాయశాఖాధికారి రాజశ్రీ తెలిపారు. మండలంలోని భావాపురం గ్రామంలో ఆహారం, పోషకాహార భద్రత పథకంలో భాగంగా సోమవారం క్లస్టర్ డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతులను సమావేశపరచిన ఏఓ రాజశ్రీ కొర్ర, సజ్జ, కంది, వరి పంటల సుస్థిరమైన ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుట, భూసారం పునరుద్ధరణ అంశాలపై వివరించారు. చిరుధాన్యాలు, అపరాలు వంటి పంటలు పండించడం ద్వారా రైతుల ఆదాయ వనరులు పెంపొందించుకోవచ్చన్నారు. నికర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. గ్రామవ్యవసాయ సహాయకులు నాన్సి ఆర్నాల్డ్, రైతులు పాల్గొన్నారు.

రైతులు వైవిధ్య పంటలు సాగుచేయాలి



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: రైతులు ఆదాయ వనరులు పెంపొందించే వైవిధ్యమైన పంటలను సాగు చేయాలని వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆహారం పోషకాహార భద్రతలో భాగంగా మండలంలోని పాములపల్లెలో కొర్ర పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కొర్ర, మొక్కజొన్న, సజ్జ, కంది వంటి పంటల సుస్థిరమైన ఉత్పత్తి ఉత్పాదకత పెంచెట, నేల సారవంతం పునరుద్ధరణ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం, సమగ్ర పంటల యాజమాన్యం వంటి వాటిపై రైతులు తెలుసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఖాశీం, సుభాని, రైతులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈకి సన్మానం



ఇరిగేషన్ డీఈని సన్మానిస్తున్న సిబ్బంది

కంభం: ఉత్తమ అధికారిగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఇరిగేషన్ డీఈ షేక్ జాకీర్ అహ్మద్‌ను సోమవారం కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. బేస్తవారిపేట ఇరిగేషన్ ఏఈ ఆనందశోభ, ఏఈఈ బాలత్రిపుర సుందరి తదితరులు డీఈకి పూలమాలలు, శాలువాలు వేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యనారాయణ

బేస్తవారిపేట: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఒంగోలు విద్యుత్‌శాఖ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల విద్యుత్‌శాఖ ఏఈలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎక్కువ ఉంటుందని సమాచారం అందుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్య ఏ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో జరిగితే అక్కడనే ఎల్‌సీ తీసుకోవాలని సూచించారు. టౌన్ మొత్తానికి విద్యుత్ సరఫరాను ఎట్టి పరిస్థితుల్లో నిలిపివేయవద్దని సూచించారు. రైతులకు వ్యవసాయ బోర్లకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు సకాలంలో మంజూరు చేయాలన్నారు. బేస్తవారిపేట పట్టణంలో 5 ఎంవీఏ అదనంగా ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడదని తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఉద్యోగులకు మౌలిక సదుపాయాలు, సబ్‌స్టేషన్ చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేస్తామన్నారు. ఏడీఏ సియానాయక్, ఏఈలు సన్యాసిరావు, నరసయ్య, నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

చదువుల సన్నిధి.. అనుబంధానికి పునాది

మార్కాపురం: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి అద్దం పట్టేది.. అనురాగం, ఆప్యాయతకు ఆలవాలంగా నిలిచేంది రాఖీ పండుగ. ఒకరికొకరు రక్షణ కల్పిస్తే.. ఒకరినొకరు మంచిని పంచిస్తే సమాజమంతా ఒకటవుతుంది. సమసమాజమే సిద్ధిస్తుందనేందుకు ఈ చిత్రం తార్కాణంగా నిలుస్తుంది. మార్కాపురం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో విద్యార్థులకు విద్యార్థినులు రక్షా బంధన్ కట్టి రాఖీ పూర్ణిమ వేడుకను ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ ఆవశ్యకతను డైరెక్టర్ కె.రంగయ్య వివరించారు. పిల్లలంతా సోదర భావంతో ఉండాలని, ఆపద వేళ సహాయం చేసుకోవాలని సూచించారు.



తురిమెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

వైద్యురాలిపై హత్యాచారం అమానుషం

● ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ ఖండన



మాట్లాడుతున్న చంద్రశేఖర్

మార్కాపురం టౌన్: కోల్‌కతాలోని వైద్యురాలి హత్యాచార ఘటన అమానుషమని ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రపుశాల చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మార్కాపురంలో మీడియాతో మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ప్రజలకు సేవచేయడంలో, వారి ప్రాణాలు కాపాడటంలో వైద్యుల సేవలను విలువకట్టలేమన్నారు. ఆర్.జి.కార్ ఆస్పత్రి ఘటనను దృష్టిలో పెట్టుకుని విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువలు బోధించడం, మహిళలను గౌరవించడం తదితర అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

కంభం: వైద్య విద్యార్థిని దాడిని నిరసిస్తూ మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోని మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దాడి అమానుషమని, నిందితులను కఠినంగా శిక్షించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. బ్రతకనిద్దాం- స్త్రీలను బ్రతకనిద్దాం, మీకు అండగా ఉంటాం- మీరు ఒంటరిగా లేరంటూ విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



కొమరోలు: ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

గిద్దలూరు రూరల్: వైద్య విద్యార్థినిపై హత్యాచారం అమానుమని ఎస్ఎఫ్ఐ నాయకుడు డి.తేజ అన్నారు. వైద్య విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని శిక్షించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజలకు వైద్య సేవలను అందించే వైద్యుల పై ఈ విధంగా అమానుషంగా ప్రవర్తించిన వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోన్, ఈశ్వర్, అశోక్, వినోద్, నవీన్, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

కొమరోలు: మహిళల కోసం కొత్త చట్టాలు తీసుకు వచ్చి వారి జోలికి వస్తే వెంటనే శిక్షించే విధంగా చేయాలని డాక్టర్ చైతన్యదీపక్ తెలిపారు. కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్యకు నిరసనగా సోమవారం కొమరోలు పట్టణంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చైతన్యదీపక్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న మానవ మృగాలను వెంటనే శిక్షించాలని తెలిపారు. డాక్టర్ అశోక్‌కుమార్, ఎంపిహెచ్ఇఒ రంగయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దత్తాత్రేయ మందిరంలో అరుణకేతుక యజ్ఞం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని గురుదత్త సంస్థాన్ ఆధ్వర్యంలో అరుణకేతుక చయన ఐంద్రాగ్న నిరూఢ యజ్ఞం ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రెండో రోజు రాష్ట్రంలోని పలువురు వేద పండితులు హాజరై దత్తాత్రేయ హోమాలు, యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకుడు బి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు చేస్తున్నారు. మంగళవారం ఇంద్ర వైమృధ యాగం, అగ్ని షోమియ యాగాలను బ్రహ్మశ్రీ మద్దూరి యజ్ఞనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు పూజ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ప్రతినిధులు గొలమారి శివారెడ్డి, రాఘవ తదితరులు విజ్ఞప్తి చేశారు.



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా అర్చకుడు మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్, బస్సు సుబ్బారావు, వెలుగోలు వెంకటేశ్వర్లు, రామాపురం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు గుర్తింపు కార్డులు

బేస్తవారిపేట: రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు గుర్తింపు కార్డులను వెంటనే మంజూరు చేస్తామని జిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ అధికారి ఎం రజనికుమారి అన్నారు. స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం మాజీ సైనికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాజీ సైనికులు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నింటికీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పిల్లలకు ఉపకార వేతనాలు, పిల్లల వివాహానికి నిధులు విడుదల, నివేశన స్థలాలకు దరఖాస్తు చెట్టుకోవాలని సూచించారు. ఇంటి పన్ను, వితంతు పింఛన్, పింఛన్ మంజూరుపై ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. బేస్తవారిపేటలో ప్రస్తుతం ఉన్న మాజీ సైనికుల కార్యాలయం స్థలం జెడ్పీ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. స్థలం మంజూరు చేస్తే నూతన భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, నాయకులు సీహెచ్ వెంకటరెడ్డి, పూనూరు గురువారెడ్డి, షేక్ వలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ అధికారిణి రజనికుమారి

పైప్‌లైన్ లీకేజీతో సాగర్ నీరు వృథా

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో సాగర్ నీరు వృథాగా పోతోంది. గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు సైడు కాలువల్లోని మురుగుతో కలిసి సాగర్ నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న సాగర్ నీరు

ఇసుక కొరతను నివారించి ధర తగ్గించాలి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇసుక కొరతను నివారించి, ధర తగ్గించి ఇవ్వాలని కోరుతూ తాపీ మేస్త్రీల సంఘం, తాపీ వర్కర్స్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా నాయకుడు అందె నాసరయ్య అధ్యక్షుడు రామిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశీం ఆధ్వర్యంలో ఇచ్చిన వినతిపత్రంలో పట్టణంలో ఇసుక సరఫరా సక్రమంగా లేనందున భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధర విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. ఇసుక సరఫరా విధానం మారుస్తామని చెప్పి అలాంటిదేమీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమ పథకాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



రెవెన్యూ అధికారులకు అర్జీ ఇస్తున్న తాపీమేస్త్రీ సంఘ నాయకులు

మీ కోసంలో 13 అర్జీలు దాఖలు

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో అర్జీలను ఏఓ రవీంద్రారెడ్డి స్వీకరించారు. వివిధ సమస్యలపై 13 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. తన పొలానికి పాస్‌బుక్ మంజూరు చేయాలని బి.తిరుపాల్‌రెడ్డి, తనకు చెందిన 76 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని లక్ష్మీసాయి, దోర్నాల, యడవల్లి గ్రామాల్లో తాను కొనుగోలు చేసిన 82 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని ఎనిబెర చిన్న జాను విజ్ఞప్తి చేశారు. మరికొందరు వ్యక్తులు కూడా తమ సమస్యలపై అర్జీలు అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న రవీంద్రారెడ్డి

ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి పూజలు

కొనకనమిట్ల: శ్రావణ పౌర్ణమి, రాఖీ సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, ఎదురాళ్లపాడు, పెదారికట్ల శివాలయాల్లో స్వామి వార్లకు అర్చనలు, అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం అన్న, తమ్ముళ్లకు వారి సోదరీమణులు రాఖీ కట్టి ఆశీర్వాదం అందుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో సగర ఉప్పర భగీరథ వంశస్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజర్షి భగీరథ మహర్షి విగ్రహాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌లు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు సతికల రామకృష్ణ, అధ్యక్షులు కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మేడిగ వీరాంజనేయులు, కోశాధికారి మట్టం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



భగీరథ మహర్షి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల తదితరులు

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

● సీఐ ఆవుల వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్: సమాజంలో సంఘటనలు పరిశీలిస్తూ విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తుల సంచారం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రాంగణంలోకి అపరిచితులు వచ్చినా, పాఠశాలకు, కళాశాలకు వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఎవరైనా ఇబ్బంది పెడితే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లకు వచ్చే వివిధ రకాల వాట్సాప్ మేసేజ్‌లను, లింకులను ఓపెన్ చేయవద్దని, తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దని, కొత్తవ్యక్తులకు ఫోన్ నంబర్లు ఇవ్వవద్దని, తెలియని నంబరు నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయవద్దని తెలిపారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కానిస్టేబుల్ నాసరయ్య, మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సూచనలిస్తున్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు

బాలికల పాఠశాలలో వైద్యశిబిరం

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం సమీపంలో ఉన్న మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో గజ్జలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సాయిచరణ్, డాక్టర్ జి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తహీనతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికల్లో రక్తహీనత ఉంటే తరచూ జ్వరం, జలుబు, దగ్గు, నీరసం, అలసట, ఆయాసంతో అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. విద్యార్థినులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, వైద్య సిబ్బంది శ్రీకాంత్, విమలమ్మ, పెద్దన్న, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యలో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ

రాచర్ల: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ-2 వారణాసి గిరిధర శర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండవ రోజు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మధ్యాహ్నం విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. గౌతవరం, రాచర్ల, ఆకవీడు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకర్ల చిన్న కాశయ్య, వెంకటేశ్వర్లు, శ్రీధర్ రావు కలిసి రూ.18 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను ఎమ్మార్సీ కార్యాలయానికి బహుకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శివకోటేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనాయక్, ఆర్పీలు వెంకటేశ్వర్లు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మైక్ సెట్ బహుకరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్‌లో 1997-98 పదోవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒక చోటకు చేరి ఒకరినొకరు ఆత్మయంగా పలకరించుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గురువుల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ పరిచయం చేసుకున్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

పొదిలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పొదిలి తాలూకా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేద కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో దర్శి రోడ్డులోని శ్రీపతి నగర్ కాలనీవాసులకు 40 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ సీహెచ్.శ్రీనివాసులను శాలువా, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి అశోక్, జి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసులు, కృష్ణ, వి.శ్రీనివాసులు, శ్రీధర్, ప్రవీణ్, దేవా, వెంకటేశ్వర్లు, వెంకటరావు, రాజు, సురేంద్ర, అభి, శ్రీనన్న తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూనియన్ సభ్యులు

బాలికకు ఆర్థికసాయం

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఎం.లక్ష్మి కళ్యాణి అనే చిన్నారి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆ బాలికకు మూడేళ్లుగా చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రాజగోపాల్‌రెడ్డి బాలికల తల్లిదండ్రుల ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని విద్యాశాఖాధికారులకు తెలియజేయగా మండలంలోని ఉపాధ్యాయులు కలిసి రూ. 67 వేలు, గిద్దలూరు మండల ఉపాధ్యాయులు, గిద్దలూరు మండల ఎంఈఓలు జింకా వెంకటేశ్వర్లు, కావడి వెంకటేశ్వర్లు కలిసి రూ.62 వేలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు రూ.16 వేలు, రాచర్ల, గిద్దలూరు మండలాల ఉపాధ్యాయులు కలిసి రూ.46 వేలను చిన్నారికి వైద్య సహాయ ఖర్చుల కోసం రాచర్ల విద్యాశాఖాధికారులు వారణాసి గిరిధర్‌శర్మ, శివకోటేశ్వరరావు చేతులు మీదుగా బాలిక తల్లిదండ్రులు రామకృష్ణ రెడ్డి, పార్వతీలకు అందజేశారు.



వైద్య సహాయ ఖర్చు కోసం ఆర్థిక సహాయం చేస్తున్న వారణాసి గిరిధర్‌శర్మ

పొలాన్ని ఇతరుల పేరుపై ఆన్‌లైన్ చేశారని ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు వీరిశెట్టి చిన్నమ్మి

కంభం: పొలాన్ని ఇతరులకు ఆన్‌లైన్‌లో ఎక్కించారని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రావిపాడు గ్రామానికి చెందిన వీరిశెట్టి చిన్నమ్మి తహసీల్దార్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. తన భర్త నరసయ్య గ్రామ తలారీగా పని చేస్తున్న సమయంలో 1988లో 206/2 స.నెం లో 4.80 ఎకరాల పొలాన్ని సాగు చేసుకోడానికి ఇచ్చారని అప్పటి నుండి మేము ఆ పొలాన్ని సాగు చేసుకుంటాన్నామని తెలిపారు. 8 ఏళ్ల క్రితం నా భర్త చనిపోయిన తర్వాత నేను సాగు చేసుకోలేక పోయానని ఆ సమయంలో 2018లో అప్పటి తహసీల్దార్, డీటీ, వీఆర్వోలు కలిసి ఇతరులకు అక్రమంగా ఆన్ లైన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ నోటీసులు పంపించి పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేస్తామని చెప్పారు.